
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0 | కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY

5



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

గురువారం 24 జూలై 2025

సిట్టింగులపై అంక్షలేవి?



జూరాల ఎడమ కాలువ వద్ద చేపల దుకాణాలు

- జూరాల వద్ద పర్యాటకులను ఆకర్షిస్తున్న మద్యం సిట్టింగులు
- మద్యం తాగి వాహనాలు నడుపుతుండటంతో ప్రమాదాలు
- కళ్ల ఎదుట కనిపిస్తున్నా చర్యలకు ఉపక్రమించని పోలీసులు
- జాతీయ రహదారి వెంట దాబాల్లోనూ ఇదే తరహా విందులు
- వరద వస్తున్న సమయంలో మితిమీరుతున్న మందుబాబులు



మహబూబ్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పర్యాటక ప్రాంతాలు కాసేపు ఆహ్లాదంగా గడపడానికి, ప్రకృతి అందాలను ఆస్వాదించడానికి ఆలవాలంగా ఉండాలి. అసాంఘిక కార్యకలాపాలకు వేదిక అయితే ప్రమాదాలు జరిగే పరిస్థితి ఎక్కువగా ఉంటుంది. పర్యాటక శోభ ఉన్న ప్రాంతాల్లో ఆ నియంత్రణ ఇటు అధికారుల నుంచి అటు పర్యాటకుల నుంచి ఉండాలి. కానీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రధాన పర్యాటక కేంద్రంగా ఉన్న జూరాల ప్రాజెక్టు వద్ద మద్యం అమ్మకాలు, సిట్టింగులపై నియంత్రణ కొరవడుతోంది. ఈ కారణంగా అక్కడికి వచ్చే పర్యాటకులు మద్యం తాగి తిరిగి వెళ్తూ ప్రమాదాల బారిన పడటమో మరొకరి ప్రాణాలను బలిచేయడమో జరుగుతోంది. తాజాగా జూరాల ప్రాజెక్టుపైన జరిగిన ప్రమాదంలో ఒక యువకుడు ఎగిరి వెళ్లి క్రస్ట్‌గేట్ల నుంచి దిగువకు పడిపోయాడు. ఆదివారం రాత్రి ప్రమాదం జరగ్గా బుధవారం సదరు యువకుడి మృతదేహం లభించింది. కర్ణాటకకు చెందిన కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరగ్గా.. మృతుడి బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. తమకు న్యాయం చేయాలని ప్రాజెక్టుపై రెండుగంటలపాటు ధర్నా చేశారు. ఇందులో తప్పు కారు నడుపుతున్న వారిదా? లేక ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వారిదా? అనేది పోలీసుల విచారణలో తేలుతుంది. కానీ ఓ నిండు ప్రాణం మాత్రం బలైపోయింది. అయితే అన్నింటిలాగే దీన్ని సాధారణ ప్రమాదంగా చూస్తే భవిష్యత్‌లో మరింతమంది ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ ప్రమాదాలకు మూలమైన మద్యం అమ్మకాలను, సిట్టింగులను నియంత్రిస్తే మేలు జరుగుతుందని, ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ, పోలీసులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

చేపల కోసం వచ్చి...

జూరాలకు ప్రధానంగా గేట్లు తెరిచినప్పుడు ఎక్కువ మంది పర్యాటకులు వస్తుంటారు.. కేవలం మద్యంప్రియులే కాకుండా సాధారణ పర్యాటకుల తాకిడి వారంతాల్లో ఎక్కుగా ఉంటుంది. సాధారణ సమయాల్లో కూడా ఇక్కడికి పర్యాటకులు రావడానికి కారణం ఇక్కడ లభ్యమయ్యే చేపలు అని చెప్పవచ్చు. ఉమ్మడి జిల్లాలోనే ఇక్కడి చేపల వంటకాలకు ప్రత్యేకత ఉన్నది. సాధారణ సమయాల్లో పర్యాటకులు ఎక్కువగా ఉండరు కాబట్టి పెద్దగా ప్రమాదాలు జరగవు. కానీ వరద వస్తున్న సమయంలో మాత్రం ఇబ్బందులు

-మిగతా 6లో..



విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు
- కొల్లాపూర్ నియోజకవర్గానికి రూ. 57.132 కోట్లు
- ఈ నెల 26న శంకుస్థాపన చేయనున్న ఉప ముఖ్యమంత్రి



కొల్లాపూర్ , జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కృషి చేస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం నుంచి కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేయించారు. మొత్తం రూ. 57.132 కోట్ల వ్యయంతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ నిధులతో పాన్‌గల్ మండల కేంద్రంలో 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించ నున్నారు. అలాగే కొల్లాపూర్ మండలంలోని యన్మన్‌బెట్ల, మొలచింతలపల్లి, కోడేరు మండలంలోని రాజాపూర్, మైలారం, పసుపుల, పెంట్లవెల్లి మండలంలోని కొండూరు గ్రామాల్లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయ నున్నారు. వీటితో పాటు పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్, మరికల్, వెన్నచర్ల, చిన్నంబావి మండలంలోని వెల్టూరు, వీపనగండ్ల మండలంలో గోవర్ధనగిరి గ్రామాలకు కూడా 33/11 కేవీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. అదే విధంగా విద్యుత్ శాఖ కొల్లాపూర్ సబ్ డివిజన్ పరిధిలోని కొల్లాపూర్, పెంట్లవెల్లి, కోడేరు, పెద్దకొత్తపల్లి మండలాలకు ప్రభుత్వం దాదాపు 200 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసింది. త్వరలో వీటి ఏర్పాటు పనులు కాను న్నాయి. ఈనెల 26న ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కొల్లాపూర్‌కు రానున్నారు. ఆయన చేతుల మీదుగా, మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ చేయనున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు
- జోగులాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిశీలన

6



జూరాల ప్రాజెక్టు గేట్లను పరిశీలిస్తున్న డీఐజీ

జోగులాంబ ఆలయ హుండీ లెక్కింపు

అలంపూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా, అలంపూరు క్షేత్రంలోని జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల హుండీని బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ మహబూబ్‌నగర్ సహాయ కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. 120 రోజులకు సంబంధించి స్వామి వారి హుండీ ద్వారా రూ. 9,76,819, అమ్మ వారి హుండీ ద్వారా రూ. 62,32,658, అన్నదానసత్రం నుంచి రూ. 41,142 ఆదాయం లభించింది. మొత్తంగా రూ. 72,50,619 సమకూరాయి. దీంతో పాటు విదేశీ నోట్లు 20, మిశ్రమ బంగారం, వెండి 380 గ్రాములు వచ్చింది. కార్యక్రమంలో ఈవో పురేందర్ కుమార్, చైర్మన్ బీ నాగేశ్వర్ రెడ్డి, ధర్మకర్తలు జగన్‌మోహన్ నాయుడు, నాగశిరోమణి, విశ్వనాథరెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, గోపాల్, జీ. వెంకటేశ్వర్లు, ఉప ప్రధాన అర్చకుడు డి ఆనంద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వానలు కురిసె.. నల్లమల మురిసె..

- పచ్చదనంతో కళకళలాడుతున్న అడవి
- మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు అందాల కనువిందు
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న కృష్ణమ్మ పరవళ్లు

6



నల్లమల కొండల నడుమ కృష్ణానది సోయగాలు

'మహాలక్ష్మి'తో ఆర్టీసీకి పునర్వైభవం

- జిల్లా సంక్షేమ అధికారి సునంద
- మహిళా ప్రయాణికులకు, విద్యార్థినులకు బహుమతులు అందజేత



కార్యక్రమంలో మాట్లాడుతున్న గద్వాల డిపో మేనేజర్ సునీత

గద్వాల అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ మహిళలకు అందిస్తున్న ప్రయాణ సేవలు ప్రశంసనీయమని జిల్లా సంక్షేమ అధికారి సునంద అన్నారు. పథకం ప్రవేశపెట్టిన అనంతరం 200 కోట్ల మందికి ఉచిత ప్రయాణం కల్పించిన నేపథ్యంలో బుధవారం గద్వాల ఆర్టీసీ డిపో వద్ద సంబురం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధికారి సునంద, దీర్ఘకాలంగా నష్టాల ఊబిలో కూరుకుపోయిన ఆర్టీసీ సంస్థ, మహాలక్ష్మి పథకం ఆసరాతో ఆర్థికంగా కొంతమెరుగు పడిందని అన్నారు. ఇది ఆహ్వానించదగిన పరిణామం అని అన్నారు. అదే సమయంలో మహిళా ప్రయాణికులు, సిబ్బంది ఇదే రకమైన ఆదరణ చూపి సంస్థను మరింత లాభాల్లోకి తేవాలని, పునర్వైభవం తేవాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడిన డిపో మేనేజర్ సునీత, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యం పొందుతున్న మహిళలు ఆర్టీసీని మరింతగా ఆదరించాలని కోరారు.

అదే సమయంలో సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ మాత్రమే మోడల్‌గా నిలిచిందని, ఈ విషయంలో సిబ్బందిపడుతున్న శ్రమ, చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అరుణ, గట్టు, మల్దకల్, ఇటిక్యాల మండలాల ప్రతినిధులు, డిపో అధికారులు సిబ్బంది ఉన్నారు. ఈసందర్భంగా ఆయా రూట్లలో ఆర్టీసీ బస్సుల్లో రెగ్యులర్‌గా ప్రయాణించే విద్యార్థులు, సీనియర్ మహిళా ప్యాసింజర్లకు బహుమతులు అందజేశారు.

నమ్మించి వంచించాడు..

- ప్రేమించి మోసం చేశాడని ఒంగోలు యువతి ఆత్మహత్యాయత్నం
- అయిజ పోలీస్ స్టేషన్ సమీపంలో ఘటన

7

యువకుడి మృతదేహం లభ్యం

- ఈనెల 20వ తేదీన 'జూరాల'లో గల్లంతు
- ప్రాజెక్టు వద్ద కుటుంబ సభ్యుల ధర్నా

7

ఉపాధి కూలీలకు అందని వేతనాలు

- రూ. 4.90కోట్ల వేతనాలు పెండింగ్
- రెండు నెలలుగా ఎదురు చూపులు
- పని దినాలలో ఇప్పటి వరకు 30 శాతమే పూర్తి



గద్వాల మండలం పూడూరులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

గద్వాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం అమలు తీరుపై కూలీలు పెదవి విరుస్తున్నారు. ఉపాధి కల్పన తగ్గిపోవడంతో పాటు, చేసిన పనికి వేతనాలు కూడా ఇవ్వడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే, జూన్ నెలలకు సంబంధించి దాదాపు రూ.4.98 కోట్ల వేతనాలు కూలీలకు చెల్లించాల్సి ఉంది. ఉపాధి హామీ అధికారులు ఎఫ్‌టీవో (ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్)లను జనరేట్ చేసినప్పటికీ, ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

4.38 లక్షల పని దినాలు పూర్తి

ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు దాదాపు రెండు నెలల నుంచి వేతనాలు అందడం లేదు. కూలీలు ఈ ఏడాది ఇప్పటి వరకు 4.38 లక్షల పని దినాలు పూర్తి చేశారు. అందుకోసం వారికి రూ.14.85 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం రూ. 9.87 కోట్లు మాత్రమే చెల్లించింది. మే నెల నుంచి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. 467 ఎఫ్‌టీవోలకు సంబంధించిన వేతనాలే రూ.4.98 కోట్లు చెల్లించాల్సి ఉంది. మరి కొన్ని ఎఫ్‌టీవోలు ఇంకా జనరేట్ కాలేదు. అవి పరిగణలోకి తీసుకుంటే ఇది రూ. 5 కోట్లకు పైగానే ఉంటుందని అంచనా. రెండు నెలలుగా డబ్బు చేతికి అందకపోవడంతో కూలీలు ఫీల్డ్ అసిస్టెంట్లను నిలదీస్తున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో పనులు చేశామని, వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని చెప్తున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి, ఆదుకోవాలని కోరుతున్నారు.

త్వరలోనే డబ్బులు వస్తాయి



ఏప్రిల్ నుంచి మే 20వ తేదీ వరకు చేసిన పనికి డబ్బులు కూలీల ఖాతాల్లో జమ అయ్యాయి. ఆ తర్వాత చేసిన పనికి డబ్బులు రావాల్సి ఉంది. మేము ఎఫ్‌టీఓవోలను జనరేట్ చేసి పంపించాము. త్వరలో కూలీల ఖాతాల్లో డబ్బు జమ అవుతుంది.

- నర్సింగరావు, అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి డీఆర్‌డీవో

50 శాతం తగ్గిన లేబర్ బడ్జెట్

ఉపాధి హామీ పథకంలో ప్రతీ ఏడాది ఏప్రిల్ నుంచి మార్చి 31 వరకు ఎంత మందికి ఉపాధి కల్పిస్తారు, వేతనాలు, మెటీరియల్ ఖర్చు ఎంత అవుతుందో లేబర్ బడ్జెట్‌ను తయారు చేస్తారు. ఈ ఏడాది దాదాపు 26 లక్షల పనిదినాలకు లేబర్ బడ్జెట్‌ను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. కానీ దానిని 13.54 లక్షల పని దినాలకు కుదించారు. పని ప్రదేశం ఫొటోలతో కూడిన కూలీల హాజరును నమోదు చేశారు. ఈ ఏడాది జూన్ చివరి నాటికి 4.38 లక్షల పని దినాలు మాత్రమే పూర్తయ్యాయి. వర్షాలు కురుస్తుండటం, వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో కూలీలందరు పొలం పనులకు వెలుతున్నారు. దీంతో జిల్లాలో ఇప్పు డు వాచ్ అండ్ వార్డ్ పనులు మాత్రమే జరుగుతున్నాయి.

నలుగురు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

నాగర్‌కర్నూల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాలకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శులపై వేటు పడింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో నలుగురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అవినీతికి పాల్పడినందుకు వారిపై చర్యలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్‌కు గురైన వారిలో బల్మూరు మండలం పోలిశెట్టిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి బాలరాజు, బిజినేపల్లి మండలంలోని గంగారం పంచాయతీ కార్యదర్శి నరేందర్, అల్లీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రజిని, ఊర్కొండ మండలం గుడిగానిపల్లి పంచాయతీ కార్యదర్శి రామచంద్రయ్య ఉన్నారు.

అక్షర ఉల్లాస్

- అక్షరాస్యత శాతం పెంచేందుకు సరికొత్త పథకం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలు
- 2.29 లక్షల మందిని అక్షరాస్యులను చేయడమే లక్ష్యం
- ప్రతీ జిల్లా నుంచి డీఆర్‌పీలుగా ముగ్గురు టీచర్లు
- 15 మందికి 26న హైదరాబాద్‌లో శిక్షణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులైన మహిళలు, పురుషులకు కనీసం చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం.. కనీస సామర్థ్యాలైన కూడికలు, తీసివేతలు చేయాలన్న లక్ష్యంతో నవ భారత సాక్షర కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ పథకాన్ని చేపట్టింది. దీన్ని పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కూడా ముందుకు వెళుతోంది. పాఠశాల విద్యావకాశం కోల్పోయి 15 సంవత్సరాలు, ఆపైబడిన నిరక్షరాస్యులను జాతీయ విద్యావిధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత, ప్రాథమిక విద్యతో పాటు డిజిటల్ అక్షరాస్యత, కీలకమైన జీవన నైపుణ్యాలు, వృత్తి నైపుణ్యాలు, నిరంతర విద్య అందించాలనే లక్ష్యంతో ఉల్లాస్ కార్యక్రమం చేపట్టింది. ఈ పథకం ద్వారా

- మిగతా 6లో..



అక్షరాస్యులను చేయాలన్న లక్ష్యంతో..



నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉల్లాస్ పథకం చేపట్టింది. అందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో రెండు లక్షలకు పైగా నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయాలన్న లక్ష్యంతో పని చేస్తున్నాం. వచ్చే నెలలో నిరక్షరాస్యులకు మహిళా, యువజన సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అక్షరాస్యులను చేసేవిధంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు కార్యక్రమం చేపడుతున్నాం.

- శ్రీనివాస్‌రెడ్డి, డీడీ, వయోజన విద్యా శాఖ


నల్లమలలో ఆక్టోపస్ వ్యూ పాయింట్

నీల్‌గాయ్

ముళ్ల పంది


కృష్ణగిరిలో టూరిజం కాటేజీలు

వానలు కురిసె.. నల్లమల మురిసె..

- పచ్చదనంతో కళకళలాడుతున్న అడవి
- మన్ననూరు నుంచి శ్రీశైలం వరకు అందాల కనువిందు
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న కృష్ణమ్మ పరవళ్లు


కణితి (సాంబార్)


చిరుత


నల్లమలలో కనిపించే పెద్ద పులి


చుక్కల దుప్పి

నల్లమల ప్రాంతం అమ్రాబాద్ అభయారణ్య పరిసరాల్లో వేసవితో పాటు వర్షాకాలం ప్రారంభం నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో అంతా పచ్చదనం సంతరించుకున్నది. మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు ఎక్కడ చూసినా పచ్చని కొండలు దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు నల్లమల ఎత్తైన కొండల నడుమ వంపులు తిరుగుతూ ప్రవహించే కృష్ణానది ఎంతగానో పర్యాటకులను ఆకట్టుకుంటుంది. పచ్చిక బయలును తలపించే అటవీ ప్రాంతంలో జంగిల్ సఫారీ టూర్‌లో, అక్కమహాదేవి గుహల సందర్శనకు వజ్రాలమడుగు వాచ్‌టవర్ తదితర ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే పర్యాటకులకు పెద్ద పులులు, చిరుతలు, చుక్కల దుప్పి, కణుతులు, నీల్‌గాయ్‌లు, ఎలుగు బంట్లు, రేసు కుక్కలు దర్శనమిస్తుంటాయి. రోజురోజుకూ నల్లమల అటవీ ప్రాంతంలో జంతువుల సంఖ్య పెరుగుతుంది.

- బ్రహ్మగిరి (దోమలపెంట), ఆంధ్రజ్యోతి


వజ్రాలమడుగు వ్యూ పాయింట్

దుందుభీ దాటేందుకు ప్రయత్నించొద్దు

- హెచ్చరించిన అధికారులు
- కాజ్‌వే నుంచి కిందికి ఒరిగిపోయిన ట్రాక్టర్


దుందుభి నది దాటుతున్న క్రమంలో ఒరిగిపోయిన ట్రాక్టర్

తాడూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో ప్రవహిస్తున్న కృష్ణానదికి ఉప నది అయిన దుందుభీ బుధవారం ప్రవాహం కాస్త తగ్గింది. నదిలో ఉన్న కాజ్‌వే వరద ప్రవాహానికి పూర్తిగా దెబ్బతినడంతో పంచాయతీరాజ్ ఏఈ శివకృష్ణ, ఎస్ఐ గురుస్వామి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నది దాటుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ నదిలోకి వంగిపోవడంతో డ్రైవర్ వెంటనే కిందికి దూకాడు. అనంతరం ఎక్స్‌కవేటర్ సాయంతో ట్రాక్టర్‌ను బయటకు తెచ్చారు. నది ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో దాటేందుకు ఎవరూ ప్రయత్నించవద్దని సూచించారు.

జడ్చర్లలో 3 డెంగీ కేసులు నమోదు

జడ్చర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలో బుధవారం మూడు డెంగీ కేసులు నమోదైనట్లు జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి భాస్కర్‌నాయక్ తెలిపారు. జడ్చర్లలోని జవహర్‌నగర్, సంజీవయ్యకాలనీ, కృష్ణారెడ్డికాలనీలో కేసులు నమోదైనట్లు వెల్లడించారు. కాలనీల్లో ఫీవర్ సర్వే, స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో పట్టణ వైద్యాధికారి మనుప్రియ, సూపర్‌వైజర్ సలోమి, శానిటరి ఇన్‌స్పెక్టర్ నరేష్, మెడికల్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

జడ్చర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పరిధిలోని బాలానగర్ మండలం, మోతిఘణపురంలో గంజాయి అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే.విప్లవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలో ఎక్సైజ్ ఎస్ఐ నాగరాజు, సిబ్బంది ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించి దినేష్‌సింగ్‌ను అరెస్టు చేశారు. అతని నుంచి 250గ్రామలు గంజాయి, ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పది రోజుల క్రితం బీహార్‌కు వెళ్లి అక్కడ రూ.2వేలకు కేజీ గంజాయి తీసుకువచ్చి మోతిగణపురంలో, కంపెనీలో పని చేసే ఉద్యోగులకు ఐదు గ్రాములు రూ.300 విక్రయిస్తున్నట్లు తెలిపారు.

వీధికుక్క దాడిలో నలుగురికి తీవ్ర గాయాలు

వనపర్తి రూరల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండలంలోని అచ్యుతాపూర్ గ్రామంలో వీధి కుక్క బుధవారం నలుగురిపై దాడి చేసింది. గ్రామానికి చెందిన కొందరు చిన్నారులు బీసీ కాలనీ గాంధీ విగ్రహం వద్ద సిద్దు, బేబీ మరొక బాలిక ఆడుకుంటుండగా కుక్క ఒక్క సారిగా దాడి చేసింది. పక్కనే ఉన్న చాకలి నరేష్ కుక్కను వెంటాడగా తిరిగి వారి పైన దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. వారిని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు జిల్లా ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ఇన్సూలిన్ అందుబాటులో లేకపోవడంతో మహబూబ్‌నగర్ రెఫర్ చేసి నట్లుకుటుంబసభ్యులు తెలిపారు. జిల్లా దవాఖానలో కుక్క కాటుకు మందులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అక్షర ఉల్లాస్

అక్షరాస్యత శాతం పెంచేందుకు సరికొత్త కార్యక్రమం

(5వ పేజీ తరువాయి)

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ విధానాలలో అక్షరాస్యత అమలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని నిరక్షరాస్యులను గుర్తించి వారికి మహిళా సంఘాలు, యువజన సంఘాల వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 2,29,326 మంది నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా చేయాలన్న లక్ష్యం పెట్టుకొని నవభారత్ సాక్షర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో నిరక్షరాస్యులను గుర్తించేందుకు ఉల్లాస్ యాప్ ఏర్పాటు చేశారు. అందులో వారి వివరాలను నమోదు చేస్తున్నారు. మొత్తానికి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇప్పటికే ఒక లక్షా 70 వేల మందిని గుర్తించినట్లు, వారిని ఉల్లాస్ యాప్‌లో కూడా నమోదు చేశారు.

ఉమ్మడి జిల్లాలో 2,29,326 మంది అక్షరాస్యులను చేయాలన్నదే లక్ష్యం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలన్న లక్ష్యంతో వయోజన విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సాధించారు. ఉల్లాస్ పథకాన్ని బలోపేతం చేయడానికి కార్పొరేట్ సంస్థలు, సీఎస్ఆర్‌లో అభ్యాసన బోధన సామగ్రి, డిజిటల్ పరికరాలు, మౌలిక సాంకేతిక సదుపాయాల కోసం దాతలు ముందుకు వస్తున్నారు. ప్రజల్లో అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. అక్షరాస్యత మేళాలు, చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 2025-2026 సంవత్సరంలో 2,29,326 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయాలన్న లక్ష్యం పెట్టుకొని వయోజన విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి మహబూబ్‌నగర్ జిల్లాలో 64,477 మంది, జోగుళాంబ గద్వాల జిల్లాలో 77,577 మంది, నాగర్‌కర్నూల్ జిల్లాలో 40,761 మంది, వనపర్తి జిల్లాలో 26,100 మంది, నారాయణపేట జిల్లాలో 20,421 మంది నిరక్షరాస్యులను గుర్తించి వారికి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా అక్షరాస్యతలో పాలమూరు ఫస్ట్.. గద్వాల లాస్ట్

జాతీయ స్థాయి అక్షరాస్యత 2011 లెక్కల ప్రకారం 74 శాతం ఉంది. అయితే, 8.66 శాతం పెరిగిందని తెలుస్తున్నది. ఇందులో మహిళలు, పురుషులు 82 శాతం ఉండగా, 6.29 శాతం వృద్ధి చెందింది. మహిళలు 65.46 శాతం ఉండగా.. 11.03 శాతం వృద్ధి చెందింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 66.54 శాతం అక్షరాస్యత ఉండగా, అందులో పురుషుల అక్షరాస్యత 75.04 శాతం, మహిళల అక్షరాస్యత 57.99 శాతం ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 60.99 శాతం ఉండగా, పురుషులు 70.69 శాతం, మహిళలు 51.25 శాతం ఉన్నారు. నాగర్‌కర్నూల్ 53.68 శాతం అక్షరాస్యత ఉండగా, పురుషులు 64.19 శాతం, మహిళలు 43.93 శాతం, వనపర్తి జిల్లాలో 56.05 శాతం ఉండగా, పురుషులు 66.19 శాతం, మహిళలు 45.67 శాతం ఉన్నారు. నారాయణ పేట 49.93 శాతం ఉండగా, పురుషులు 60.32 శాతం, మహిళలు 39.72 శాతం, జోగుళాంబ గద్వాల జిల్లాలో 49.87 శాతం అక్షరాస్యులు ఉన్నారు. ఇందులో పురుషులు 60.05 శాతం, మహిళలు 39.48 శాతం ఉన్నారు.

అక్షరాస్యత పెంచేందుకు ప్రత్యేక దృష్టి

రాష్ట్ర వ్యాప్తంగా అక్షరాస్యతను పెంచేందుకు వయోజన విద్యాశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. అందులో భాగంగానే ప్రతీ జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేసి, వారికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ కార్యక్రమం ఈనెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి ఉమ్మడి జిల్లా నుంచి 15 మంది టీచర్లు శిక్షణలో పాల్గొననున్నారు. అక్కడ నేర్చుకున్న అంశాలను ఆయా జిల్లాలో మండల స్థాయిలో మరో ముగ్గురు, నలుగురు టీచర్లకు, మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణ ఇస్తారు. వీరు గ్రామస్థాయిలో మహిళా సంఘాలకు, యువజన సంఘాలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి షెడ్యూల్‌ను వయోజన విద్యశాఖ విడుదల చేసింది. ఈ నెల 31 లోపు మండల, గ్రామ స్థాయి శిక్షణలు పూర్తి చేస్తారు.

సిట్టింగులపై ఆంక్షలేవి?

(5వ పేజీ తరువాయి)

తలెత్తుతున్నాయి. పర్యాటకులు కూడా చాలా సందర్భాల్లో ఇబ్బందులు పడుతుంటారు. కేవలం ఇక్కడ చేపల వంటకాలు మాత్రమే దొరికితే కూడా ఇబ్బంది ఉండదు. కానీ దాంతోపాటు విరివిగా మద్యం విక్రయాలు ఇక్కడ సాగుతుంటాయి. వచ్చిన మద్యం ప్రియుల కోసం సిట్టింగులు కూడా ఉంటాయి. ఆ సిట్టింగుల్లో మద్యం సేవించి వెళ్తా యువకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులకు అంతా తెలిసే జరుగుతుంటుంది. కానీ చర్యలకు మాత్రం ఉపక్రమించరు. పర్యాటకం దెబ్బ తింటుందనో లేక వారికి అందాల్సినవి అందవనే కారణాలు కావొచ్చు. కానీ నియంత్రణ మాత్రం ఉండటం లేదు. కర్ణాటక, గద్వాల నుంచి వచ్చే పర్యాటకులు ధరూర్‌లో, పాలమూరు నుంచి వచ్చేవారు అమరచింతలో, వనపర్తి నుంచి వచ్చేవారు ఆత్మకూరులో మద్యం కొనుగోళ్లు చేస్తున్నారు. అక్కడ దొరక్కపోతే చేపల వంటకాల కేంద్రాల వద్దనే కావాల్సిన మద్యం అందుబాటులో ఉంటోంది. అక్కడ సిట్టింగులపై నిషేధం విధించి పర్యాటకులను ఆకర్షించేందుకు ఏర్పాట్లు చేస్తే ఉపయోగంగా ఉంటుంది. సాధారణ పర్యాటకుల సంఖ్య కూడా పెరుగుతుంది. చేపల వంటకాలు ఉంటే ఇబ్బంది ఉండదు కానీ మద్యం అమ్మకాలు, సిట్టింగులపై కచ్చితంగా నియంత్రణ ఉండాలి.

జాతీయ రహదారుల వెంటా...

ఉమ్మడి పాలమూరు జిల్లాకు దాదాపు 200 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి 44 ఉన్నది. ఈ రహదారి వెంట అనేక హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు ఉన్నాయి. ప్రయాణికుల భోజన అవసరాలకు ఏర్పాటు చేసినప్పటికీ అనేక దాబాల్లో మద్యం సిట్టింగులే నడుస్తున్నాయి. ప్రత్యేకంగా క్యాబిన్లు ఏర్పాటు చేసుకొని, వంటకాలు సిద్ధం చేయడం ఇక్కడ నిత్య తంతుగా ఉన్నది. కానీ ఒక్కసారి కూడా పోలీసులు తమ పరిధిలోని సిట్టింగులపై దృష్టి సారించడం లేదు. వివిధ ప్రాంతాలకు వెళ్తున్న ప్రయాణికులు మద్యం సేవించి రోడ్డు ప్రమాదాలకు బలవ్వడమో లేదా ఇతరులకు మరణాలకు కారణం అవుతున్నారు. జాతీయ రహదారి వెంట 500 మీటర్ల పరిధిలో మద్యం దుకాణాలు ఉండకూడదనే నిబంధనను కూడా పలుచోట్ల పాటించడం లేదు. లేదా జాతీయ రహదారికి సమీపంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం, అక్కడే కావాల్సిన మటన్, చికెన్ వంటకాల దుకాణాలు వెలుస్తుండటం, దారిలోనే వాటిని కొనుగోలు చేసి వాహనం వెళ్తుండగా సేవించడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

అటు పర్యాటక ప్రాంతాలు, ఇటు జాతీయ రహదారుల సిట్టింగులపై దృష్టి సారించకపోతే మరిన్ని ప్రమాదా లకు కారణమయ్యే పరిస్థితి ఉంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు
- జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పరిశీలన


జూరాల ప్రాజెక్టు వద్ద ఎస్పీలతో మాట్లాడుతున్న జోగుళాంబ జోన్ డీఐజీ

ధరూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు, వరదల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ సూచించారు. ఎలాంటి విపత్తులు ఎదురైనా ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీస్‌శాఖ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూర్ మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును బుధవారం వనపర్తి, గద్వాల జిల్లాల ఎస్పీలు రావుల గిరిధర్, టి.శ్రీనివా సరావులతో కలిసి పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కృష్ణానదికి వస్తున్న వరదతో కానీ, వర్షాల వల్లగానీ ప్రజలకు ఎలాంటి విపత్తు ఎదురైనా తక్షణమే పోలీస్‌శాఖ స్పందించి చర్యలు తీసుకుంటుందన్నారు. కర్ణాటక, మహా రాష్ట్రల నుంచి కృష్ణానదికి వరద ఉధృతి కొనసాగుతోందని తెలిపారు. దీంతో వనపర్తి జిల్లాలోని 6 గ్రామాలు, జోగుళాంబ గద్వాల జిల్లాలో 6 గ్రామాలు ఎక్కువ ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆయా గ్రామాల్లో అధికారులు చేపట్టాల్సిన చర్యలపై జిల్లా పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. వరదలు, వర్షాలు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రమాదాలు సంభవించకుండా పోలీసులు ఇతర ప్రాంతాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జూరాల ప్రాజెక్టును పరిశీలించారు. డ్యాంలో నీటి ప్రవాహంతో పాటు గేట్ల మరమ్మతులు, జూరాలకు సంబంధించి ఆయకట్టు ఎంత ఉంది తదితర అంశాలపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఆ తర్వాత ధరూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని, ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. జోగుళాంబ జోన్ డీఐజీ వెంట గద్వాల డీఎస్పీ మొగులయ్య, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు, గద్వాల సీఐ టంగుటూరి శ్రీను, అలంపూర్ సీఐ రవిబాబు, వనపర్తి సీఐ రాంబాబు, ధరూర్ ఎస్ఐ కొండా శ్రీహరి, మదనాపురం ఎస్ఐ శేఖర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

27న శాంతిచర్చలు - ప్రజాస్వామిక అన్వేషణ పుస్తకం ఆవిష్కరణ

పాలమూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : శాంతి చర్చలు - ప్రజాస్వామిక అన్వేషణ పుస్తకం 27వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరిస్తున్నట్లు పాలమూరు అధ్యాయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ యం.రాఘవాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజ పురోగతి, ప్రజాస్వామిక సహజీవనానికి సౌభ్రాతృత్వం, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం ప్రాణవాయువు లాంటివని తెలిపారు. సమాజం కులం, మతం, పితృస్వామ్యం, అస మానతల వంటి అడ్డంకులను అధిగమించడానికి నిత్య సంఘర్షణలో ఉందని పే ర్కొన్నారు. ఇటీవల హరగోపాల్ ఇచ్చిన రెండు ఇంటర్వ్యూలు, ఎస్.ఆర్ శంకరన్ స్మారకోపన్యాసం, మరోరెండు ఉపాన్యాసాలు కలిపి శాంతిచర్చలు - ప్రజాస్వామిక అన్వేషణ పుస్తకంగా ప్రచురించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి, జస్టిస్ చంద్రకుమార్, రమామెల్కోటే, లక్ష్మణ్‌గడ్డం, హరగోపాల్, పీబీస్వామి, విజయ్ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

పాలమూరులో జోరువాన


నారాయణపేటలో సత్యసాయి కాలనీ క్రాసింగ్ వద్ద రహదారిపై నిలిచిన వర్షపునీరు

మహబూబ్‌నగర్/నారాయణపేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో వానలు జోరుగా కురుస్తున్నాయి. కొద్దిరోజులుగా క్రమం తప్పకుండా ప్రతీరోజు వర్షం కురుస్తోంది. మంగళవారం అర్ధరాత్రి తరువాత జిల్లాలోని పలు మండలాలలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బుధవారం వాతావరణం మేఘావృతమై ఉన్నది.

- మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో 44.3 మి.మీ. వర్షపాతం నమోదుకాగా, నవాబ్‌పేటలో 43 మి.మీ., కౌకుంట్లలో 32.4, రాజాపూర్‌లో 28.3, అడ్డాకులలో 29.5, సీసీకుంటలో 28.6, దేవరకద్రలో 20.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.
- నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో 31.8 మి.మీ. వర్షపాతం, నమోదైంది. ఊట్కూర్ మండలంలో 24.3 మి.మీ. వర్షపాతం నమోదుకాగా నారాయణపేట మండలంలో 21.5 మి.మీ., మరికల్ 19.0 మి.మీ., దామరగిద్ద మండలంలో 15.5, గుండుమాల్ 13.5, కోస్గి 12.8, నర్వ మండలంలో 12.0 మి.మీ. వర్షపాతం నమోదైంది.

బ్రహ్మగిరి పోలీస్‌స్టేషన్ నిర్మాణమయ్యేనా?

- 25 ఏళ్ల క్రితం పేల్చివేసిన మావోయిస్టులు
- మన్ననూర్‌లో స్టేషన్ బ్రహ్మగిరిలో తాత్కాలిక పోలీస్ షెల్టర్
- 2018లో రూ. 3 కోట్లు కేటాయింపు
- స్థలం లేక వెనుదిరిగిన నిధులు
- ఏపీ-తెలంగాణ సరిహద్దులో ఆయుధ భద్రత కరువు


2001 సంవత్సరంలో మావోయిస్టులు పేల్చిన పోలీస్‌స్టేషన్ స్థలం

బ్రహ్మగిరి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్న బ్రహ్మగిరి (దోమలపెంట) పోలీస్‌స్టేషన్‌ను 25ఏళ్ల క్రితం మావోయిస్టులు పేల్చివేశారు. నాటి నుంచి బ్రహ్మగిరిలో మామ్ములుగా షెల్టర్‌లో స్టేషన్ నిర్వహణ కొనసాగుతుంది. 2004కు ముందు నల్లమల అటవీ ప్రాంతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. 2001లో బ్రహ్మగిరి (దోమలపెంట), పక్కన ఉన్న సుండిపెంట పోలీస్ స్టేషన్‌లను పేల్చివేస్తామని అప్పట్లో పోలీసులకు హెచ్చరిక చేయడంతో బ్రహ్మగిరి పోలీస్ స్టేషన్‌ను అమ్రాబాద్‌కు, సుండిపెంట పోలీస్ సేషన్‌న్లను ఖాళీ చేసి శ్రీశైలానికి తరలించించి అక్కడి నుంచే విధులు నిర్వర్తించేవారు. అదే ఏడాది కొంతకాలనికి బ్రహ్మగిరి, సుండిపెంట పోలీస్ స్టేషన్లను ఏకకాలం పేల్చి వేశారు. కాల క్రమేనా నల్లమలలో మావోయిస్టు పార్టీ పూర్తిగా తూడిచిపెట్టుకు పోవడంతో నల్లమల పల్లెల్లో ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవిస్తున్నారు.

అటవీశాఖ అభ్యంతరంతో..

బ్రహ్మగిరిలో పోలీస్ స్టేషన్ పునర్నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం 2018లో రూ.3 కోట్లు మంజూరు చేసింది. వీటితో పోలీస్ గెస్ట్ హౌజ్, పోలీస్ స్టేషన్ నిర్మాణం చేపటేందుకు అప్పట్లో స్థలాల పరిశీలన చేపట్టారు. అటవీశాఖ అధికారులు ఈ నిర్మాణాలకు అభ్యంతరం తెలిపడంతో ఎక్కడికక్కడే నిలిచిపోయింది. బ్రహ్మగిరి నుంచి పాతాలగంగ వరకు ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉన్నపటికీ అటవీశాఖ అభ్యంతరాలతో అనేక అభివృద్ధి పనులు నిలిచి పోయాయి.

ఆయుధ భద్రత కరువు

ఇరు రాష్ట్రాల సరిహద్దులో శ్రీశైలం డ్యాం, కుడి, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్రాలకు వేల కోట్ల సంపదనిచ్చే కలప వృక్షం లాంటి వనరులున్నాయి. ఇక్కడ మాత్రం డ్యాం, విద్యుత్ కేంద్రాల వద్ద పహారా కాసేందుకు ఎస్‌పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తారు. వీరికి ఎటువంటి ఆయుధాలు ఉండవు. దేశంలో, రాష్ట్రంలో తీవ్రవాదులు అల్లర్లు సృష్టించినప్పుడు ఇక్కడ పోలీస్, ఆర్మీ భద్రత కల్పిస్తారు. బ్రహ్మగిరిలో ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం, ఎస్ఎల్‌బీసీ సొరంగం, జెన్‌కో కార్యాలయం, ప్రభుత్వ బ్యాంకు, అటవీశాఖ కార్యాలయం, పోస్టాఫీస్, పాఠశాలలు వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఉంటున్నారు. ఇక్కడ తప్పనిసరి పోలీస్ స్టేషన్ అవసరమని స్థానికులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

యువకుడి మృతదేహం లభ్యం



మహేష్ (ఫైల్)

ధరూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని రేవుపల్లి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు 48వ గేటు వద్ద ఈ నెల 20వ తేదీన కారు, బైక్‌ను ఢీకొన్న సంఘటనలో నీటిలో పడి గల్లంతైన మానవపాడు మండలం ఏబూడిదపాడు గ్రామానికి చెందిన మహేష్(25) అనే యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. మూడు రోజులుగా మృతదేహం కోసం ధరూర్ ఎస్‌ఐ కొండా శ్రీహరి, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు జాలర్లు కూడా డ్యాంలో తీవ్రంగా గాలించారు. కాగా, బుధవారం వనపర్తి జిల్లా పరిధిలోని ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామ శివారులో గల కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం చేపల వేటకు వెళ్లిన జాలర్లకు కనిపించింది. వారు ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా మహేష్ మృతదేహంగా నిర్ధారించుకొని ధరూర్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ శ్రీహరి తన సిబ్బందితో అక్కడి చేరుకొని బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా

మహేష్ మృతదేహం లభించడంతో శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా తమకు న్యాయం చేయాలని జూరాల ప్రాజెక్టు వద్ద కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. విషయం తెలుసుకున్న ధరూర్ ఎస్‌ఐ కొండా శ్రీహరి సంఘటనా స్థలానికి చేరుకొని అన్నివిధాలా న్యాయం చేకూరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు శాంతించారు.

చెట్టుకు ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య

బిజినేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు బిజినేపల్లి మండలంలోని మమ్మాయిపల్లి గ్రామానికి చెందిన నక్క మైబూస్(25) మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. బుధవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు చెట్టు కు ఉరేసుకొని ఉన్న మైబూస్‌ను చూసి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కిందికి దించి పంచనామా చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి నక్క అలివేలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి కింద పడి యువకుడి మృతి



కిషన్‌నాయక్ (ఫైల్)

బల్మూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : అడవి పందులను ఢీకొట్టి ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని మైలారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి లింగాల మండలం ఎంసీతండాకు చెందిన కాట్రావత్ కిషన్‌నాయక్ (35) పని నిమిత్తం అచ్చంపేటకు వెళ్లి తిరిగి రాత్రి 9:10గంటల సమయంలో గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డు పక్క నుంచి అడవి పం దులు గుంపులుగా వేగంగా రావడంతో వాటిని ఢీకొని అదుపు తప్పిన కిం ద పడి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. ఆ సమయంలో ఎవరూ రాక పోవడంతో ప్రాణం పోయినట్లు తెలిపారు. రాత్రంతా అక్కడే మృతదేహం ఉందని, బుధవారం తెల్లవారుజామున అటుగా వస్తున్న ఓ రైతు గమనిం చి వెంటనే 108కు సమాచారం అందించడంతో సిబ్బంది చూసి మృతి చెందాడని నిర్ధారించి వెంటనే పోలీసులకు సమాచారమందించారని తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

జడ్చర్ల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని పోలేపల్లి సెజ్‌లో నివాసముండే గుంటరాములు బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గుంటరాములు ప్రభుత్వం ఇచ్చిన ఇందిరమ్మ ఇంటికి క్యూరింగ్ కోసం నీటి మోటార్ ఆన్‌చేస్తుండగా వైర్లు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

- ముగ్గురి పరిస్థితి విషమం
- మరో ముగ్గురికి గాయాలు

ఊర్కొండ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని వెనకాల నుంచి కారు ఢీకొన్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ఊర్కొండపేట శివారులోని ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీ జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వెళ్తుండగా జాతీయ రహదారిపై కాటన్‌మిల్లు సమీపంలో టైరు పంక్చర్ కావడంతో పక్కకు ఆపారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన ఐదుగురు షాబాద్ మండలానికి చెందిన ఒకరు కారులో శ్రీశైలం వెళ్తుండగా ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొన్నారు. ఘటనా స్థలానికి ఎస్‌ఐ కృష్ణదేవ, స్థానికులు చేరుకొని క్షతగాత్రులను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమార్, లింగం, యాదయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ తరలించగా, అభిలాష్, ప్రశాంత, కిరణ్‌లకు స్వల్ప గాయాలు కాగా వారికి కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎన్. పవన్ మద్యం తాగి పట్టుబడ్డాడు. బుధవారం అతన్ని కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి మూడు రోజుల జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే శిక్షార్హులవుతారని ఎస్‌ఐ హెచ్చరించారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కృష్ణ, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుర్తు తెలియని వాహనం ఢీకొని కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాకు చెందిన నర్సప్ప తలకు తీవ్ర గాయాలైన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని గుడెబల్లూరు పంచాయతీ పరిధిలోని టైరోడ్డు వద్ద బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం టైరోడ్డు వద్ద కల్లు తాగి పడుకుని మత్తు దిగిన అనంతరం జాతీయ రహదారిపై నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నర్సప్ప తల వెనుక తీవ్ర గాయమై, స్పృహ కోల్పోయి పడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్‌ఐ నవీద్ తన సిబ్బంది కలిసి ఘటనా స్థలానికి చేరుకుని అతన్ని అంబులెన్స్ ద్వారా రాయచూరు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులు సమాచారం అందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంట నాశనం చేశారని ఫిర్యాదు

అలంపూర్ చౌరస్తా, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : ఉండవల్లి మండలంలోని కలుగొట్ల గ్రామ శివారులోని పంటను నాశనం చేశారని లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఏపీలోని కర్నూలు జిల్లా కల్లూరు మండలం, పెద్దపాడు గ్రామానికి చెందిన కుర్వలక్ష్మీదేవికి 2011లో ఆమె తల్లి నాగమ్మ ఉండవల్లి మండలం, కలుగొట్ల గ్రామశివారులో 3.11ఎకరాల వ్యవసాయభూమి పసుపు కుంకుమ కింద ఇచ్చింది. ఇందులో మొక్కజొన్నపంట సాగు చేసింది. నాలుగురోజుల క్రితం పొలం చూసేందుకు వెళ్లగా తనపంట చెరిపివేసి ఉండటాన్ని గమనించింది. ఆమె అల్లుడు చిన్నరాముడు, సోదరుడు పెద్ద మద్దిలేటి, కుమార్తె మహేశ్వరి భర్త శ్రీనువాసులు ఉద్దేశపూర్వకంగా నాశనం చేశారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధాప్యం.. ఉల్లాసం..

- జిల్లాలో వృద్ధుల కాలక్షేపం కోసం డే కేర్ సెంటర్
- అటల్ వయో అభ్యుదయ యోజన పథకంలో భాగంగా ఏర్పాటు
- సేవలందించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ అంగీకారం



గద్వాల సర్కిల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య దశ ఒక శాపం అన్న మానసిక క్షోభను మనసులోంచి తొలగించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ముదిమి కష్టాలకు కళ్లెం పడనుంది. జీవన చరమాంక దశలో కష్టాల కడలి ఏ రూపంలోనైనా తమ దరికి చేరనివ్వకుండా కేంద్ర ప్రభుత్వం మహాకార్యానికి శ్రీకారం చుట్టింది. అందుకు అటల్ వయో అభ్యుదయ యోజన పథక సేవలు త్వరలోనే గద్వాల జిల్లా కేంద్రంలో అందుబాటులోకి తీసుకురానుంది.

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో..

కేంద్ర ప్రభుత్వం అటల్ వయో అభ్యుదయ యోజన డే కేర్ సెంటర్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ నిధులతో, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సేవలు అందించనుంది. రాష్ట్రంలో 33 జిల్లాలో 37 సెంటర్లు ప్రారంభం కానున్నాయి. 29 జిల్లాలకు ఒక్కో సెంటర్‌ను మంజూరు చేయగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజగిరి, హన్మకొండ జిల్లాలకు రెండు చొప్పున మంజూరయ్యాయి.

60 ఏళ్లు దాటిన వారు..

డే కేర్ సెంటర్‌లో సేవలు పొందేందుకు 60 ఏళ్లు దాటిన వారు అర్హులు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే వృద్ధులు తమ విలువైన సమయాన్ని వెచ్చించుకోవచ్చు.

పరిమిత సంఖ్యలోనే..

ప్రతీ డే కేర్ సెంటర్‌లో 50 మంది పరిమితి సంఖ్యలోనే సేవలందిచేలా నిర్ణయం తీసుకుంది. నిర్వహణ పర్యవేక్షణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మహిళా శిశు సంక్షేమ, దివ్యాంగుల, సీనియర్ సిటిజన్ విభాగాలు, కలెక్టర్ ఆధీనంలో కొనసాగుతుంది.

అందే సేవలు ఇవే..

ప్రధానంగా ఆరోగ్య సేవలతో పాటు వారు సెంటర్‌లో ఉన్నంత సమయం వరకు సంరక్షణ, అల్పాహారం, ఆటలు, వినోదం, మనసును ఒత్తిళ్ల నుంచి దూరం చేసేలా వివిధ ఆత్మవిశ్వాసాన్ని నింపే ఉల్లాస భరితమైన కార్యక్రమాలను నిర్వహించనుంది.

వృద్ధులకు సేవలందించడం సంతోషం



గద్వాలలో త్వరలో ప్రారంభం కానున్న అటల్ వయో అభ్యుదయ యోజన పథకానికి సేవలందించే కార్యాచరణలో మొదటి ప్రాధాన్యత కేంద్ర ప్రభుత్వం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని ఎంపిక చేయడం సంతోషంగా ఉంది. డే కేర్ సెంటర్‌లో పలు విభాగాల్లో సేవలందించేందుకు అర్హులైన వారిని కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం నియమిస్తాం. ఇప్పటికే సెంటర్ సేవల విషయమై తాము అంగీకారపత్రాన్ని జిల్లా సంక్షేమ శాఖకు అందజేశాం. రెడ్‌క్రాస్ సొసైటీ కార్యనిర్వాహక సమావేశంలో సెంటర్ స్థాపన, నిర్వహణ చర్చించి కలెక్టర్ ఆదేశానుసారం గద్వాలలో వయో వృద్ధులకు డే కేర్ సెంటర్ సేవలను ప్రారంభిస్తాం.

- రమేష్, ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్, గద్వాల

సేవలకు ఇండియన్ రెడ్‌క్రాస్ అంగీకారం

గద్వాలలో అటల్ వయో అభ్యుదయ యోజన పథకం డే కేర్ సెంటర్‌లో వయో వృద్ధులకు సేవలందించేందుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందుకు వచ్చింది. ఈ మేరకు సెంటర్ స్థాపన, వాటి నిర్వహణ తాము చూసుకుంటామని అంగీకార పత్రాన్ని జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమశాఖకు ప్రతినిధులు అందజేశారు.

మత రాజకీయం దేశ ప్రగతికి విఘాతం

- రాజ్యాంగం జోలికొస్తే బీజేపీకి పుట్టగతులుండవ్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల నరసింహ



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఆత్మకూరు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మత విద్వేషాలు దేశ ప్రగతికి విఘాతమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ తెలిపారు. సీపీఐ వనపర్తి జిల్లా మూడో మహాసభలు ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించారు. అంతకుముందు ఆత్మకూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నుంచి భారీ ర్యాలీగా ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. అనంతరం ఆయన మహాసభలను ఉద్దేశించి మాట్లాడుతూ.. విదేశీ బ్యాంకుల్లో భారతీయ కుబేరులు దాచుకున్న నల్లధనాన్ని రప్పించి దేశ ప్రజలకు సమానంగా పంచుతానని హామీ ఇచ్చిన నరేంద్ర మోదీ, ఆర్థిక నేరగాళ్లకు దేశ సంపదను దోచి పెట్టేందుకు పూనుకుందని ధ్వజమెత్తారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి అనుకూలంగా దేశ ప్రజలు జీవనం కొనసాగిస్తుంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజ్యాంగ సవరణల పేరుతో కుల, మత, వర్గ విభేదాలకు ఆజ్యం పోస్తూ సంఘ్ పరివార్ శక్తుల ఎజెండాను పాలనా రంగంలోకి చొప్పిస్తున్నారని విమర్శించారు. ఉగ్రవాద పాకిస్తాన్ ముష్కరులపై ట్రంప్ ఆదేశాలతో యుద్ధం ఆపిన మోడీ దేశంలో ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అంతం చేసే కుట్రలు బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో కార్మికులు, కర్షకులు ఉన్నంతకాలం కమ్యూనిస్టులు ఉంటారన్నారు. కమ్యూనిస్టులు లేకుండా చేస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్ర ప్రభుత్వ విధానాలు పగటి కలలుగానే మిగిలిపోతాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విజయ రాములు, కళావతమ్మ, శ్రీహరి, శ్రీరామ్, మోష్, అబ్రహం, నరసింహ, శెట్టి, లక్ష్మీనారాయణ శెట్టి, గోపాలకృష్ణ, చంద్రయ్య, భాస్కర్, కుతుబ్, శాంతయ్య, కురుమన్న, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

దాగుడుమూతలాడుతున్న చిరుత

- మూడు రోజులకో సారి గుట్టపైకొచ్చి దర్శనం
- చిరుతను చూసేందుకు జనం ఆసక్తి
- తొలిసారి సీసీ కెమెరాకు చిక్కిన చిరుత



కలెక్టర్ బంగ్లా ఫ్లైఓవర్ నుంచి చిరుతను చూస్తున్న ప్రజలు

మహబూబ్‌నగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : టీడీగుట్ట-వీరన్నపేట మధ్యన ఉన్న గుట్టపైకి చేరిన చిరుత 25 రోజులుగా అధికార యంత్రాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎన్ని ప్రయత్నాలు చేసినా చిక్కకుండా అధికార యంత్రాంగంతో దాగుడు మూతలాడుతోంది. రెండుచోట్ల బోన్లు ఏర్పాటు చేసి అందులో మేకలను పెట్టినా చిరుత అటువైపు కన్నెత్తి చూడటం లేదు. తీరిక దొరికినప్పుడల్లా జనాలకు మాత్రం మూడ్రోజులకోసారి దర్శనం ఇస్తుంది. ఎక్కడో పెద్ద బండరాళ్లపైకి వచ్చి కాసేపు కూర్చొని వెళ్లిపోతుంది. చిరుత వచ్చినపుడల్లా జనం ఫోటోలు తీసేందుకు ఎగబడుతున్నారు. కాగా మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో అటవీశాఖ అధికారులు అడవిలో ఏర్పాటు చేసిన ఓ కెమెరాలో రికార్డయ్యింది. ప్రజలకు కనిపిస్తున్నది.. సీసీ కెమెరాలో కనిపించిన చిరుత ఒకటేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ కొండపై ఒకటే చిరుత ఉన్నట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. బుధవారం ఉదయం అదే ప్రాంతంలో నెమలి, అడవి పంది, కుందేలు కనిపించాయి. మంగళవారం సాయంత్రం టీడీగుట్టపైన ఉన్న ఓ బండరాయిపై చిరుత కనిపించింది. బుధవారం కూడా కొండపై చిరుత ఉందన్న అపోహతో కలెక్టరేట్ బంగ్లాపై వెళ్లే వాహనదారులు ఎక్కడికక్కడ నిలవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. చిరుతను కెమెరాలలో బంధించి సామాజిక మాధ్యమాలలో వైరల్ చేసేందుకు పోటీపడుతున్నారు. గుట్ట సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలు భయంతో వణుకుతున్నారు. చిరుత కనిపించిందనగానే పోలీస్, అటవీ, మునిసిపల్ అధికారులు పరుగున అక్కడికి చేరుకోవాల్సి వస్తోంది. వారు వచ్చేలోపు అక్కడి నుంచి చిరుత జారుకుంటుంది. బోనులో చిక్కితే తప్పా చిరుత కష్టాలు తప్పేలా లేవు.

వినియోగంలోకి వంద పడకల ఆసుపత్రి

- హర్షం వ్యక్తం చేస్తున్న అలంపూర్ ప్రజలు
- వైద్యులను సన్మానించి, బాణసంచా కాల్చిన కాంగ్రెస్ నాయకులు



ఆసుపత్రి ఎదుట డాక్టర్లు, వైద్య సిబ్బందితో సమన్వయ అధికారి రమేష్‌చంద్ర

అలంపూర్ చౌరస్తా, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : రెండేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించి వదిలేసిన వంద పడకల ఆసుపత్రి ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చింది. బుధవారం ఓపీ సేవలు ప్రారంభమైనట్లు వైద్య విధాన పరిషత్ సమన్వయకర్త రమేష్‌చంద్ర తెలిపారు. మొదటిరోజు 32 ఓపీలు వచ్చినట్లు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ సయ్యద్ భాష చెప్పారు. ప్రతీరోజు డాక్టర్లు, 20 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని, సాధారణ ఓపీలు మాత్రమే చూస్తున్నట్లు తెలిపారు. మూడు వారాల్లోపు అన్ని సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

సంబురాలు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు ఉండవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్ ఆధ్వర్యంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, ముఖ్య నాయకులు కలిసి ఆస్పత్రి వద్ద సంబురాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి, స్వీట్లు పంచుకున్నారు. విధులకు హాజరైన డాక్టర్లను, సిబ్బందిని సన్మానించారు. ఆనాడు ఓట్ల కోసం ఎంతో హడావుడిగా నిర్మించి, ఎలాంటి పరికరాలు, సిబ్బందిని నియమించకుండా వదిలేశారని తెలిపారు. అలంపూర్ నియోజకవర్గ ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతిపదికన ఆసుపత్రిలో పనులు చేయించి ప్రారంభించిన ఘనత సంపత్‌కుమార్‌కే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో రాము, జగన్‌మోహన్‌నాయుడు, మద్దిలేటి, శ్రీకాంత్, కుమార్, రామాచారి, మద్దిలేటి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి వంచించాడు..

- ప్రేమించి మోసం చేశాడని ఒంగోలు యువతి ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : పెళ్లి చేసుకుంటానని ఓ యువకుడు మోసం చేశాడని ఒంగోలుకు చెందిన ఓ యువతి జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పోలీస్ స్టేషన్ సమీపంలోనే పురుగుమందును స్ప్రే చేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన బుధవారం చోటుచుసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన యువతి అనూష కుటుంబం బతుకు తెరువు కోసం కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లో స్థిరపడింది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో అనూష, అయిజకు చెందిన రజాక్ ప్రేమించుకున్నారు. ప్రేమపేరుతో దగ్గరైన రజాక్ పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఎలాగైనా తనను పెళ్లి చేసుకుంటాడని నమ్మకంతో ఆ యువతి డిగ్రీ పూర్తయ్యాక ఇంటినుంచి బయటకు వచ్చేసింది. దీంతో మూడు నెలల పాటు ఆ యువతిని హాస్టల్‌లో ఉంచి రజాక్ ఖర్చులు భరించాడు. ఆ తర్వాత తన తండ్రి చనిపోయాడని చెప్పి ఇంటికి వచ్చిన ఆయన మళ్లీ అనూషను పట్టించుకోకపోగా మీ ఇంటికి వెళ్లిపోవాలని, తాను అయిజలోనే ఉంటానని చెప్పాడు. దీనికి అనూష ససేమిరా అన్నది. హైదరాబాద్‌లోని వారాసిగూడ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు రజాక్‌ను గతంలో జైలుకు కూడా పంపారు. వారి వివాహానికి ఒప్పుకున్న రజాక్ కుటుంబీకులు బెయిన్ వచ్చిన తర్వాత బాధితురాలిని పట్టించుకోలేదు. దీంతో పలుమార్లు, యువకుడి ఇంటికి, అయిజ పోలీస్ స్టేషన్‌కు తిరిగినా ఫలితం లేకుండా పోయింది.

దీంతో విసిగిపోయిన అనూష బుధవారం అయిజ పోలీస్ స్టేషన్ సమీపంలోనే పురుగు మందును ముక్కులో, నోటిలో స్ప్రే చేసుకొని ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన స్థానికులు అయిజ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి, మెరుగైన చికిత్స కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వివరాలను అడిగేందుకు వచ్చిన పోలీసులను అనూష కుటుంబ సభ్యులు నెలరోజులుగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని, ఇప్పుడు వివరాలను అడిగి ఏమిచేస్తారని మండిపడ్డారు. ఈ విషయంపై అయిజ ఎస్‌ఐ శ్రీనివాస్‌రావును ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

విద్యా నిధికి విరాళం

- కలెక్టర్‌కు రూ. 8లక్షల చెక్కు అందజేసిన మునిసిపల్ కాంట్రాక్టర్లు



విద్యా నిధికి రూ. 8లక్షల చెక్కును ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కలెక్టర్ విజయేందిర బోయికి అందజేస్తున్న మునిసిపల్ కాంట్రాక్టర్లు

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం మహబూబ్‌నగర్‌కు చెందిన 40 మంది మునిసిపల్ కాంట్రాక్టర్లు విద్యానిధికి విరాళం ఇచ్చారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో రూ. 8లక్షల చెక్కును ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మునిసిపల్ కాంట్రాక్టర్లు ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. విద్యాభివృద్ధికి చేయూత ఇస్తున్న కాంట్రాక్టర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో ఉన్న విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, పౌరులు విద్యా నిధికి విరాళాలు ఇవ్వాలని కోరారు. విద్యానిధికి వచ్చే ప్రతీ పైసా పేద విద్యార్థుల విద్య కోసం ఖర్చు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సంజీవరెడ్డి, ప్రవీణ్‌కుమార్, ప్రశాంత్, రాషెద్‌ఖాన్, ఖాజాపాష, అంజద్, యాదయ్య, మునిసిపల్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న వరద

- 43వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 38,500 అవుట్ ఫ్లో

రాజోలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద కొనసాగుతుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బుధవారం ఉదయం డ్యాంకు 43వేల క్యూసెకులు నీరు ఎగువ నుంచి వచ్చి చేరుకుంది. దీంతో 8 గేట్లు ఒక మీటర్ ఎత్తుకు తెరిచి 38,500 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.068 టీఎంసీలు ఉందని, నీటి నిల్వ 292 మీటర్లు కాగా ప్రస్తుతం 291.60 మీటర్లు నమోదైనట్లు డ్యాం జేఈ స్వామి తెలిపారు.

ఆర్‌ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మన్ననూర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన పారిశ్రామిక శిక్షణసంస్థ (ఆర్‌ఐటీఐ)లో 20205-26-27 విద్యాసంవత్సరం రెండో విడత ప్రవేశా లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మణస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోపా, డ్రాఫ్ట్‌మెన్‌సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్‌తో పాటుగా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయని అన్నారు. పదోతరగతి విద్యార్హత కల్గిన అభ్యర్థులు ఐటీఐ తెలంగాణ వెబ్‌సైట్‌లో ఈ నెల 31 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవా లన్నారు. కులం, ఆదాయం, స్థానిక, బదిలీ, బోనఫైడ్ ధ్రువీకరణ పత్రాలను దరఖాస్తుతో జతపరచాలని కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు వారి సొంత ఈ మెయిల్ ఐడి, ఫోన్ నంబరుతో లాగిన్ కావాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 31 వరకు వచ్చిన దరఖాస్తుదారులకు ఆర్‌ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించి రిజర్వేషన్, పదోతరగతి మెరిట్ ప్రాతిపదికన సీట్ల భర్తీ చేయనున్నట్లు వివరించారు.

ఏటీసీలో అడ్మిషన్ల కోసం ..

కల్వకుర్తి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆరు కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థినీ, విద్యార్థులు 2025-26,27 విద్యా సంవత్సరా నికిగాను ఈనెల 31వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. అదేవిధంగా ప్రభుత్వ ఐటీఐ, ప్రైవేట్ ఐటీఐల్లో రెండవ విడతలో ప్రవేశాలకు ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం స్థానిక ఐటీఐ కాలేజ్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

ఇంటర్వ్యూ..

రైతులకు అందుబాటులో యూరియా

- హన్మంతురెడ్డి, మండల వ్యవసాయాధికారి



గట్టు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి హన్మంతురెడ్డి చెప్పారు. తమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలపై ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వివరించారు.

మండలంలో ఎరువులు ఎన్ని అందుబాటులో ఉన్నాయి?

వానాకాలం పంటల సాగుకు సరిపడా ఎరువులను సిద్ధంగా ఉంచాము. మండలంలో 55 ఫర్టిలైజర్ దుకాణాల్లో 110 మెట్రిక్ టన్నుల యూరియా, 109 మెట్రిక్ టన్నుల డీఏపీ, 800 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచాము.

ఎరువుల పంపిణీపై పర్యవేక్షణ ఉందా?

మండలంలో రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచడంపై మండల మానిటరింగ్ బృందం పర్యవేక్షణ చేస్తుంది. ఏ ఇబ్బంది ఉన్నా వెంటనే పరిష్కరిస్తుంది.

రైతు నమోదు ప్రక్రియ కొనసాగుతున్నదా?

మండలంలో ఏఈవోలు రైతు పంటల వివరాల నమోదు ప్రక్రియను చేయిస్తున్నారు. ఇది నిరంతర ప్రక్రియ. ప్రతీ రైతు తప్పకుండా వివరాలు నమోదు చేయించుకోవాలి.

ఎంతమందిని నమోదు చేశారు?

మండలంలో చాలామంది రైతుల ఆధార్ కార్డులకు మొబైల్ నెంబర్ లింక్ కాకపోవడంతో సమస్య ఏర్పడుతున్నది. ఇప్పటివరకు 50 శాతం మేర నమోదు ప్రక్రియ పూర్తి చేశాం.

న్యూస్ బాక్స్

రేపు జిల్లా వైద్యశాఖ అధికారితో ఫోన్ ఇన్

గద్వాలన్యూటౌన్, జూలై23(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో శుక్రవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ సిద్దప్ప తెలిపారు. జిల్లాలో కొంతకాలంగా వైరల్ జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నందు వల్ల ఫోన్ ఇన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యాధులపై అవగాహన, నివారణపై తగుసలహాలు, సూచనలు పొందేందుకు శుక్రవారం ఉదయం 11నుంచి 12గంటల వరకు డీఎం హెచ్‌వో డాక్టర్ సిద్దప్పతో 9985878931కు ఫోన్ చేసి మాట్లాడవచ్చని తెలిపారు.

ఓటర్ జాబితాలో తప్పులు రానివ్వొద్దు

మానవపాడు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 17 గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ జాబితా ఉండేలా చూడాలని ఎంపీడీవో రాఘవ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ కార్యదర్శులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఓటర్ జాబితాలో తప్పులకు తావులేకుండా చూడాలని సూచించారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

ఇటిక్యాల, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ శాఖ ఎన్నికల కన్వీనర్ మధుసూదన్‌గౌడ్ అన్నారు. బుధవారం ఇటిక్యాల మండల అధ్యక్షుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో ఉదండాపురంలో ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తిమ్మారెడ్డి, కిషోర, నాగముణి, గజేంద్ర, మునీందర్‌రెడ్డి, మహేందర్, వీరన్న, గోవిందు ఉన్నారు.

రాజోలిలో భద్రత పెంచాలి

రాజోలి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాజోలిలో భద్రతను పెంచాలని కోరుతూ బుధవారం బీజేపీ మండల అధ్యక్షుడు శశికుమార్, నాయకులు రాజోలి ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. శశికుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు ఉన్నందున అక్రమ రవాణా జరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోవిందరాజులు, ఈసీ ఆంజనేయులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కేటీదొడ్డి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉపాధ్యాయ సంఘం నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ అన్నిక్యాడర్ల బదిలీలు పదోన్నతుల షెడ్యూల్‌ను తక్షణమే విడుదల చేయాలని జీహెచ్‌ఎం, యస్ఎ, పీఎస్‌హెచ్‌ఎం ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు గోపాల్, హుస్సేన్, వనిత, కర్రెప్ప, గజేంద్ర, తన్వీర్, లోక్యానాయక్, ఎల్లప్ప ఉన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

అలంపూరుచౌరస్తా, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం తన సిబ్బందితో కలిసి ఉండవల్లి ఎస్సై శేఖర్ మొక్కలు నాటారు. మొక్కలను నాటి సంరక్షిస్తే అవి తిరిగి మనకు ఆక్సిజన్‌ను అందించి మన ప్రాణాలను కాపాడుతాయన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సంతోషమ్మ, హెడ్‌కానిస్టేబుల్ వీరన్న ఉన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం



గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం బాషా

● విద్యారంగం సమస్యలు పరిష్కరించాలి

● వామపక్ష విద్యార్థి సంఘాల డిమాండ్

గద్వాల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ వామపక్ష విద్యార్థి సంఘాలు బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లాలో విజయవంతమైంది. జిల్లాకేంద్రం గద్వాలలోని విద్యాసంస్థలను ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు బంద్ చేయించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలల వద్దకు వెళ్లిన వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు బంద్‌కు సహకరించాలని కోరారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం బాషా డిమాండ్ చేశారు. విద్యాశాఖకు వెంటనే మంత్రిని నియమించాలని ముఖ్యమంత్రిని కోరారు. గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, హాస్టళ్లలో మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని, ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టేందుకు తగిన చట్టం తేవాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులకు ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని, రాష్ట్రంలో జాతీయ విద్యా విధానం-2020ని అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. విద్యార్థి సంఘాల బంద్ పిలుపు నేపథ్యంలో పట్టణంలోని దాదాపు అన్ని ప్రైవేటు విద్యాసంస్థలు స్వచ్ఛందంగా సెలవు ప్రకటించాయి. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రంగస్వామి, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ వీరశేఖర్, వెంకటేశ్ రఘుపతి, వీరేష్, రామకృష్ణ, నాగరాజు ఉన్నారు.

● అయిజ టౌన్: వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ అయిజ పట్టణంలో విజయవంతమైంది. ఆయా విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నాయకుడు హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి సారూ..

● పోలీసులను ఆశ్రయించిన పొగాకు రైతులు

గట్టు, జూలై 23 (ఆంధ్రజ్యోతి): సాగు చేయించిన పొగాకును కొనుగోలు చేయకుండా ఇబ్బందిపెడుతున్న కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని పొగాకు సాగు చేసిన రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం గట్టు పోలీసులను ఆశ్రయించారు. మండలంలోని మిట్టదొడ్డితో పాటు చాగదోణ రైతులు బుధవారం గట్టు పోలీసులకు తమ గోడును వెల్లబోసుకున్నారు. గ్రామానికి చెందిన మాల తిమ్మప్ప, చిన్నతిమ్ములు, కొటగోడ నర్సింహులు, ఉప్పరి ఈరనన, మాల రాజు, ఈరన్న గౌడు, రంగన్న, ఉరుకుందు,వినోద్‌గౌడు, హన్మంతు, గౌరన్న తదితరులు గట్టుకు చేరుకుని తమ గోడును పోలీసులకు వెల్లడించారు. దాదాపు 600 బేళ్ల పొగాకును వీఎస్‌టీ కంపెనీ వారు కొనుగోలు చేయడంలేదని, దీంతో తమ ఇళ్లలోనే పొగాకు బేళ్లు నిల్వ ఉంచుకుని నష్టపోతున్నామని వివరించారు. పొగాను సాగు చేయబోమని చెప్పి ప్రస్తుతం కొనుగోలును నిలిపివేశారని దీంతో తాము నష్టాల పాలవుతున్నామని తమకు న్యాయం చేయాలని వారు పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

రేపు పెన్షన్ అదాలత్

గద్వాల న్యూటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ మంజూరు సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న ఉదయం 10.30నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉమ్మడి మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయంలోని జిల్లాల డ్రాయింగ్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ఏదైనా అలసత్వం ఉంటే, దానిని తీవ్రంగా పరిగణిస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

స్వర్ణమల్లికను ఆదర్శంగా తీసుకోవాలి

● జూనియర్ జిల్లా జడ్జిగా ఎంపికైన స్వర్ణమల్లికను సన్మానించిన జిల్లా న్యాయాధికారి



జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణమల్లికను సన్మానిస్తున్న జిల్లా న్యాయమూర్తి ప్రేమలత

గద్వాల క్రైం, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గట్టు సంఘం స్వర్ణమల్లికను జూనియర్ న్యాయవాదులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా జడ్జి ప్రేమలత అన్నారు. బుధవారం గద్వాల బార్ అసోసియేషన్‌లో సీనియర్ న్యాయవాది గట్టు సంఘం సురేశ్ కుమార్తె గట్టు సంఘం స్వర్ణమల్లిక జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపిక కావడంపై బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు జడ్జి ఎస్.రవికుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి రవికుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి టి. లక్ష్మి. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి నేరెళ్ల వెంకట హైమపూజిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌నాయక్, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులు ఉన్నారు.

ఆలయాలకు చేరిన జల కలశాలు



జలకలశంతో అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వైండింగ్ రాములు

గద్వాల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంచల్ రాష్ట్రం హరిద్వార్ నుంచి 24వేల నదుల జలాలతో కూడిన కలశాలు బుధవారం గద్వాల పట్టణంలోని పలుఆలయాలకు చేరాయి. స్థానిక పాతహౌసింగ్ బోర్డు కాలనీ స్వామి శరణం అయ్యప్ప, అన్నపూర్ణ దేవి ఆలయాలకు చేరిన కళాశాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వైండింగ్ రాములు ప్రత్యేక పూజలు నిర్వహించి అందుకున్నారు. జలాలను అందించిన స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ అభినేష్, రవికుమార్, శ్యామప్ప, నల్లన్న, శ్రీనివాసులు, అశోక్, శ్రీలత, సుభాషిణి, అంకిత, కృష్ణ ఉన్నారు. రాఘవేంద్రకాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయానికి చేరిన జల కలశాలకు అక్కడి అర్చకులు, ఆలయ కమిటీ బాధ్యులు పూజలు నిర్వహించి స్వీకరించారు.

క్రీడాకారుల కోసం సింథటిక్ కోర్టు ఏర్పాటు

» రేపటి నుంచి ఉత్తనూర్‌లో జాతీయ స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు



ఉత్తనూర్‌లో క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సింథటిక్ కోర్టు

అయిజ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉత్తనూర్ గ్రామములో జాతీయ స్థాయిలో జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించతలపెట్టారు. ఈ పోటీలను ఈనెల 25న శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. మాజీ ఎంపీపీ దివంగత ఉత్తనూర్ తిర్మల్‌రెడ్డి 2021లో మొదటిసారి ఈ క్రీడలకు శ్రీకారంచుట్టారు. అప్పటి నుంచి ఏటా నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. ఆయన జ్ఞాపకార్థం ఈ పోటీలు గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి నిర్వహించనున్నారు. క్రీడాకారులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఈ సంవత్సరం సింథటిక్ కోర్టును రూ.7 లక్షల వ్యయంతో ఏర్పాటు చేశారు. జూపల్లి అరుణ్‌కుమార్ సౌజన్యంతో తెలంగాణ బాస్కెట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఉత్తనూర్‌లోని ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఉన్న జయశంకర్ విద్య క్రీడా ప్రాంగణంలో నిర్వహించతలపెట్టారు.

ఈ పోటీలు ఈ నెల 25న ప్రారంభమై 28వ తేదీ వరకు కొనసాగించనున్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గద్వాలటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): గద్వాల అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్, ఐటీఐలలో ప్రవేశాల కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎస్‌వీవీ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26, 2025-27 విద్యాసంవత్సరాలకు గాను ఎస్‌సీవీటీ ప్యాటన్ కింద ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్ కోసం ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గద్వాల ప్రభుత్వం ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ (రెండు సంవత్సరాల కోర్సుల), మెకానిక్ డీజిల్ (సంవత్సరం కోర్సు) అందుబాటులో ఉన్నాయన్నారు. గద్వాల అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో సీఎన్‌సీ మెషిన్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్, వర్చువల్ అనాలసిస్ అండ్ డిజైనర్-ఎఫ్ఈఎం (రెండేళ్ల కోర్సులు), ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ టెక్నీషియన్ (ఒక సంవత్సరం కోర్సులు) అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఆన్‌లైన్‌లో ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025 ఆగస్టు 1నాటికి 14 సంవత్సరాలు నిండి పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. 8వ తరగతిలో ఉత్తీర్ణులైన వారికి కొన్ని కోర్సుల్లో ప్రవేశానికి అర్హత ఉంటుందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి



కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న హనుమంతు నాయుడు

● రేవంత్ సర్కార్ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

● గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంతు నాయుడు

ధరూర్, జూలై23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని గద్వాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బాసు హనుమంతునాయుడు పిలుపునిచ్చారు. అదే సమయంలో గత కేసీఆర్ పాలనలో అమలైన పథకాలు, గ్రామాల్లో అభివృద్ధిపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు. బుధవారం ధరూర్ మండల కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశానికి హనుమంతు నాయుడు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధరూర్ మండలం రేవుపల్లి, మార్లవీడు, పాగుంట గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ధరూర్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో హనుమంతు నాయుడు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గులాబీ కండువా కప్పివారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో చక్రధర్‌రావు, రాఘవేంద్రరెడ్డి, మోనేష్, రాజారెడ్డి, వెంకటేశ్ నాయుడు, సోమశేఖర్‌రెడ్డి, పాతపాలెం శ్రీనివాస్‌గౌడ్, జాంపల్లి భరత్‌సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బీచుపల్లి, పటేల్ జనార్దన్ రెడ్డి, రాము, నాయుడు, జయసింహారెడ్డి, శేఖర్ నాయుడు గంజిపేటరాజు, శ్రీరాములు నూర్‌పాషా, జి.కృష్ణరెడ్డి, మహేవప్ప, కొండాపురం గోవిందు ఉన్నారు.

చినుకుపడితే చిత్తడే..

వడ్డేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్ అంబేడ్కర్ విగ్రహం వెనకాల రహదారి చినుకు పడితే చిత్తడిగా మారిపోతుంది. ఈ రహదారి వెంట కన్యకా పరమేశ్వరి ఆలయానికి వెళ్లే భక్తులు నానాఅవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా ఈదారి వెంట రెండు ప్రైవేటు ఆస్పత్రులు ఉండటం వల్ల రోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. శాంతినగర్ నుంచి కోవెల దిన్నెకు వెళ్లేదారి అధ్వానంగా మారింది. మారుమూల గ్రామాల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. మునిసిపాలిటీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారులపై మొరం వేయించాలని, ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

» మల్దకల్‌లో పీహెచ్‌సీ, ఫర్టిలైజర్ దుకాణాలను పరిశీలించిన కలెక్టర్



మల్దకల్ పీహెచ్‌సీ వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ బి.ఎం.సంతోష్

మల్దకల్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ బి.ఎం సంతోష్ ఆదేశించారు. బుధవారం ఆయన మల్దకల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో అందుతున్న వైద్యసేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. హైరిస్క్ ఉంటే గుర్తించి తగిన వైద్యజాగ్రతలు తీసుకోవాలని సూచించారు. సహజ ప్రసవాలు సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రక్తపరీక్షలు, మూత్ర, ఇతర పరీక్షలను వేగంగా పూర్తి చేసి తక్షణ రోగనిర్ధయం చేయాలని అన్నారు. గర్భిణుల కోసం ఏర్పాటు చేస్తున్న యోగా కేంద్రం భవన నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆధికారి డాక్టర్ సిద్దప్ప, డాక్టర్ స్వరూప రాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఎరువులు, విత్తనాల కొరత రానివ్వొద్దు

మల్దకల్‌లోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. గోదాంలోని స్టాక్‌ను పరిశీలించారు. నిర్వహణ పకడ్బందీగా ఉండాలని చెప్పారు. ప్రతీ రైతునుంచి ఆధార్ వివరాలు నమోదు చేసుకుని ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. అనంతరం ఆ పక్కనే ఉన్న పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ జిల్లా కోఆపరేవ్ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ ఝాన్సీ రాణి పీఏసీఎస్ అధ్యక్షుడు తిమ్మారెడ్డి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సంగీతలక్ష్మి, రైతులు ఉన్నారు.

రెవెన్యూ సేవలు పారదర్శకంగా నిర్వహించాలి

» వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి

గద్వాల న్యూటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సేవలను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ బీఎం. సంతోష్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్‌హాలులో అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశమయ్యారు. ప్రజలకు అవసరమైన రెవెన్యూ సేవలు ఆలస్యం కాకుండా నిబద్ధతతో చేయాలన్నారు. భూసమస్యలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో చూస్తున్నదని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి పరిష్కరించాలని, వంద శాతం ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. మీసేవ ద్వారా 2022 సంవత్సరం వరకు వచ్చిన అన్ని పెండింగ్ దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీవో అలివేలు, ఏవో భూపాల్‌రెడ్డి, డీఎస్‌వో స్వామికుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడీ రాంచందర్, అన్ని మండలాల తహసీల్దార్లు ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం

» జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్‌బాషా



అయిజలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్‌బాషా

అయిజ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ తోటలు సాగుచేస్తే రైతులు సుస్థిర లాభాలు గడించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి అక్బర్‌బాషా అన్నారు. బుధవారం అయిజ పట్టణంలోని రైతువేదికలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో టీజీ ఆయిల్‌ఫెడ్ సహకారంతో అయిజ, గట్టు మండలాలకు చెందిన వ్యవసాయ శాఖలోని క్షేత్రస్థాయి అధికారులైన వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామీణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, టెక్నికల్ అసిస్టెంట్లకు ఆయిల్‌పామ్ పంటలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఒకసారి సాగుచేస్తే 30సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. చీడపీడల బెడద తక్కువగా ఉంటుందన్నారు. అకాలవర్షాలకు, వడగండ్లవానకు ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. ప్రతి నెలా కంపెనీ నిర్దేశించిన ధరకు కొనుగోలు చేస్తారని, నాణ్యమైన మొక్కలను ప్రభుత్వం రూ.20కే అందజేస్తుందని తెలిపారు. సబ్సిడీపై రైతులకు డ్రిప్ అందిస్తామన్నారు. అంతర పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం కింద నగదు చెల్లిస్తుందని తెలిపారు.

కార్యక్రమంలో టీజీ ఆయిల్ ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి శివనాగిరెడ్డి, అయిజ వ్యవసాయాధికారి జనార్దన్, గద్వాల డివిజన్ అధికారి మల్లేష్, ఆయిల్‌ఫెడ్ అధికారులు యుగందర్, అశోక్, వర్ధన్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి



ఉత్పత్తులను పరిశీలిస్తున్న కమిషనర్, అధికారులు

● మునిసిపల్ కమిషనర్ దశరథ్

● మెప్మా ఆధ్వర్యంలో వివిధ ఉత్పత్తుల ప్రదర్శన

గద్వాల టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో మహిళలు స్వశక్తితో ఆర్థికంగా బలోపేతం కావాలని మునిసిపల్ కమిషనర్ దశరథ్ కోరారు. పట్టణ పేదరిక నిర్మూలన (మెప్మా) పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయాన్నిసద్వినియోగం చేసుకోవాలన్నారు. మెప్మా ద్వారా లభించిన ఆర్థిక సహాయంతో పట్టణంలోని వివిధ మహిళా సంఘాలు చేపడుతున్న వస్తు ఉత్పత్తులను బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ప్రదర్శనను ప్రారంభించి వస్తువులను తిలకించిన కమిషనర్, మహిళా సంఘాల సభ్యులను అభినందించారు. పట్టణంలోని అన్నివార్డులకు చెందిన మహిళలు తరలివచ్చి తాము ఉత్పత్తి చేసిన వివిధ రకాలు వస్తువులు, ఆహార పదార్థాలు, ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమంలో ఆర్‌వో రాజేష్‌కుమార్, ఏఈ గోపాల్, మెప్మా సిబ్బంది వెంకటేశ్వర్లు, నిజాముద్దీన్, తిమ్మన్న, మహాలక్ష్మి, రీసోర్సుపర్సన్లు, మునిసిపల్ అధికారులు ఉన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

ఉండవల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యారంగాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) నాయకులు కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బుధవారం యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ఉండవల్లిలోని కార్యాలయంలో తహసీల్దార్ ప్రభాకర్‌ను కలిసిన నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కుమార్ నాయుడు, మండల అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు నరేష్, మునిస్వామి, డీటీఎఫ్ సభ్యులు సాయిబాబ, ఈశ్వర్, శ్రీనివాస్, చలం ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వడ్డేపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోజురోజుకూ సైబర్ మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని శాంతినగర్ ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక స్టేషన్‌లో ఎస్ఐ విలేకరులతో మాట్లాడారు. వాట్సప్‌లో వచ్చిన మేసేజ్‌లు క్లిక్ చేసినట్లయితే డబ్బులు పడతాయని సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారు. రెండు రోజులు క్రితం చాటకొండ వెంకటేశ్ అనే వ్యక్తి ఫేస్‌బుక్ ద్వారా పరిచయమైన వ్యక్తికి రూ.8లక్షలు యాప్‌లో వేయించుకుని మోసం చేసిన సంఘటన వెలుగు చూసిందన్నారు. గోల్డ్ బ్లాక్ లైన్ పేరిన ఫైస్‌బుక్‌లో పరిచయమైన వ్యక్తి సూచన మేరకు నగదు డిపాజిట్ చేసే ఇరవై శాతం వెనువెంటనే అధికంగా అకౌంట్‌లో పడతాయిని మోసం చేశారన్నారు. అందులో భాగంగా శాంతినగర్ పట్టణానికి చెందిని వెంకటేష్ అనే వ్యక్తి యాప్‌కు రూ.8లక్షల నగదు ట్రాన్స్‌ఫర్ చేసి మోసపోయాడని ఎస్ఐ తెలిపారు. బాధితుడు ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించాలని శాంతినగర్ ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవంలో భాగంగా బుధవారం జులకల్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. చెట్లతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు ఉన్నారు.